క్లుప్తంగా

విమానాశ్రయంలో స్వరూపానందేంద్రకు వీడ్కోలు



గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో మంగళవారం విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామిజీకి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. విజయవాడలోని ముత్యాలంపాడులో జరిగిన కోటి రుద్రాక్ష అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన తిరిగి వైజాగ్ వెళ్లేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. విమానాశ్రయంలో ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్, పలువురు భక్తులు, తదితరులు ఆయనకు వీడ్కోలు పలికారు.

బీఎస్‌ఆర్ షోరూమ్ సందర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని బీఎస్‌ఆర్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్‌ను మంగళవారం విశాఖపట్నం శ్రీ శారద పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ సందర్శించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేతలు బి.నాగిరెడ్డి, రోహిత్ రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ మరింత అభివృద్ధి చెంది, సమాజానికి గొప్ప సేవ చేయాలన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవ సమయంలో హర్యానాలో చండీయాగం జరుగుతున్నందున రాలేదని తెలిపారు. తొలుత షోరూమ్ అధినేతలు బి.నాగిరెడ్డి, బి.రోహిత్‌రెడ్డి స్వామీజీకి స్వాగతం పలికారు.

సత్యనారాయణపురం విచ్చేసిన స్వామిజీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విశాఖ శారదపీఠాధిపతులు శ్రీస్వరూపానంద స్వామి మంగళవారం సత్యనారాయణపురం గడియారంవారివీధిలోని మారుతీ గ్యాస్ కంపెనీ అధినేత చెట్లపల్లి మారుతిప్రసన్న ఇంటికి విచ్చేశారు. ఈ సందర్భంగా మారుతి ప్రసన్న స్వామిజీకి ఆత్మీయ స్వాగతం పలికి కుటుంబ సభ్యులతో కలసి పాదపూజలు నిర్వహించి స్వామిజీ ఆశీస్సులు అందుకున్నారు. గౌతమ్‌రెడ్డి, యాంపాటి శ్రీనివాస్, అమర్నాథ్, సూరిపెద్ది శ్యామ్ తదితరులు స్వామిజీ ఆశీస్సులు అందుకున్నారు.

బీబీఏ అధ్యక్ష కార్యదర్శులుగా సుందర్, శ్రీధర్

విజయవాడ స్పోర్ట్స్: బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్ష కార్యదర్శులుగా కె.బి.సుందర్, జె.శ్రీధర్ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఈ ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి డి.పి.రామకృష్ణ మంగళవారం ప్రకటించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా ఎస్.జ్యోతి, కోశాధికారిగా బి.వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శిగా పి.జయలక్ష్మి, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా పి.ఆంజనేయులు ఎన్నికయ్యారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: మోహన్ కృష్ణ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలు, శ్రీ రామనవమి సందర్భంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణారందం కళావేదిక మీద మంగళవారం నిర్వహించిన సినీ, భక్తి గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. సీనియర్ గాయకడు బీ ఆశయ్య ఆధ్వర్యంలో ప్రవాసాంధ్ర గాయని కృష్ణ సింధూ, నాయక్, ఏ శివనాగ లక్ష్మి నాగలక్ష్మి, రూపసత్యశ్రీ భక్తి గీతాలతోపాటు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలు, జేసుదాసు, మనో, సుశీల, చిత్ర, జానకి, ఎస్పీ శైలజ ఆలపించిన గీతాలను మధురంగా ఆలపించారు. సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీబాయి, కోశాధికారి బి.మోహన కృష్ణ పాల్గొన్నారు. గాయకుడు ఆశయ్య గాయనీ గాయకులను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): డివిజన్ పర్యటనలో భాగంగా 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి సత్యనారాయపురంలోని పొట్టూరివారివీధిలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు తోతట్టుగా ఉండడంతో నిత్యం డ్రైయినేజీలు పొంగి మురుగునీరు రోడ్లపై పారటంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు తెలిపారు. సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన విషయాన్ని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే విష్ణు సానుకూలంగా స్పందించి ఈ వీధిలో త్వరలోనే మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశం చారన్నారు.

మహా యజ్ఞంలా ఆసరా ఉత్సవాలు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళల్లో ఆర్థిక చైతన్యం తీసుకువచ్చేందుకు ఆసరా ఉత్సవాలను ఒక మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో మంగళవారం జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అక్కా చెల్లెమ్మలకు ఆసరా పథకం చెక్కులను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులచే ప్రదర్శింపజేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొలుత దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆసరాతో అక్కచెల్లెమ్మలకు బాసటగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఆంధ్రప్రదేశ్‌ను సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

డ్వాక్రా మహిళలను బాబు మోసగించారు..

2014లో అధికారంలోకి రావడానికి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను అడ్డం పెట్టుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక పొదుపు సంఘాలను నిలువునా మోసగించారన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో ఆసరా మూడో విడత నగదుకు ఎవరి సిఫార్సులు లేకుండానే.. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతకు సంబంధించి 27వ డివిజన్‌లో 96 గ్రూపులకు 83 లక్షల 89 వేల 170 రూపాయలు అందజేశామన్నారు.

మహిళా పక్షపాతి సీఎం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళ పక్షపాతి అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో పీఓయూసీడీ కె.శకుంతల, సీడీఓ జగదీశ్వరి, నాయకులు, పెద్దసంఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 28వ డివిజన్ లక్ష్మీనగర్ కటకం చెంచయ్య కల్యాణ మండపంలో మంగళవారం ఆసరా ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండలరావుతో కలిసి మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వ డివిజన్‌లో ఇచ్చిన మాట ప్రకారం 75 గ్రూపుల్లోని 745 మందికి 70 లక్షల 47వేల 95 రూపాయలను నేరుగా వారి ఖాతాలలో జమ చేశామన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అక్క చెల్లెమ్మల ఖాతాల్లో ఆసరా నిధులను జమ చేయటం సీఎం జగన్ చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



సెబ్ సీఐ స్వరాజ్యలక్ష్మి సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన సే నో టూ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వల్పకాలిక సంతోషం కోసం విలువైన జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విలువైన జీవితం ఏ విధంగా నాశనం అవుతుందో ఉదాహరణలతో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియచేసేందుకు విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కౌన్సెలర్ టి.శ్రీపతి జగదీష్, మణిరత్నం మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జి.నాగార్జున, డాక్టర్ కె.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో వెలుగులు

57వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు మాలాంటి పేద ప్రజల కుటుంబాలకు ఎన్నో మేలులు చేస్తున్నాయి.. వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి పథకాల అమలు తీరు చాలా గొప్పగా ఉన్నాయని 57వ డివిజన్ అమరావతి కాలనీ, జామతోట ప్రాంతాలకు చెందిన బి.రమాదేవి, డి.సరోజిని అనే మహిళలు ఆనందం వ్యక్తంచేశారు. ఆ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం' మంగళవారం జరిగింది. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వారికి ప్రభుత్వ పథకాలను వివరించారు. మహిళలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చాలా బాగుందని, ప్రభుత్వ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ధీమా వ్యక్తంచేశారు.

మరింత మెరుగైన పాలన

రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పరితపిస్తున్నారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దీనికి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గడప గడప కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని కాంక్షించే మంచి వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. పేదలకు న్యాయం జరుగుతుంటే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఓర్వలేకపోతున్నాయని, రానున్న ఎన్నికల్లో ఎలా అయినా లబ్ధి పొందాలనే దురుద్దేశంతో అసత్య ప్రచారాలతో నిత్యం ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలను చేపడుతున్నారని మండిపడ్డారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో విజయవాడ నగర ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందన్నారు. నగర శివారు ప్రాంతాల్లో కూడా అన్ని మౌలిక వసతులను కల్పించి, అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. నీచరాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు ఫుల్‌స్టాప్ పెట్టే రోజు అతి దగ్గరలోనే ఉందన్నారు. డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఈ అరుణ్‌కుమార్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరీ, నాయకులు మల్లెల చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, నెల్లి గోవింద్‌నాయుడు, బాల, ప్రేమ్, ఎస్‌ఎస్‌ఆర్ పాల్గొన్నారు.

• కోటి రుద్రాక్ష అభిషేకంలో ప్రముఖులు



బాబా సేవలో స్పీకర్ తమ్మినేని దంపతులు



బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో కోటి రుద్రాక్ష అభిషేకం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. విశాఖ శ్రీశారదాపీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి, ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్, డెప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.



సర్టిఫికెట్‌లను అందుకుంటున్న శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామిజీ, స్పీకర్ తమ్మినేని, గౌతమ్‌రెడ్డి తదితరులు

దాసాంజనేయుని సేవలో స్పీకర్ తమ్మినేని దంపతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో స్వామివారిని మంగళవారం శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని స్పీకర్ దంపతులను స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు. తొలుత ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

రాజ్యలక్ష్మి మృతికి సంతాపం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ నాయకురాలు మద్దసాని రాజ్యలక్ష్మి అకాల మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్తను తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, కొండా జయలక్ష్మి, చింతా శ్రీను, బత్తుల పాండు, రెహ్మాన్, రాజు, జి.చిన్నా పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

పాయకాపురం(విజయవాడసెంట్రల్): బాలికలకు పౌష్టికాహారం అందించటంతో పాటు 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయరాదని కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి సూచించారు. ప్రకాష్ నగర్ వాటర్ ట్యాంక్ నందు పోషణ అభియాన్, 'పోషణ్ పక్వాడా' కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కల్పన, సెక్టార్ సూపర్‌వైజర్ ప్రమీల పాల్గొని మాట్లాడారు. చైల్డ్ లైన్ సిబ్బంది, అబ్రహం, మేరీ, సూర్య, కుదిరెళ్ల వీరబాబాబు, హైమావతి పాల్గొన్నారు.

యజమానిని బురిడీ కొట్టించిన వ్యక్తి అరెస్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యజమానిని, పోలీసులను బురిడీ కొట్టించి రూ.5 లక్షల కాజేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ సురేష్ కేసు వివరాలను మంగళవారం మీడియాకు వివరించారు. గవర్నర్‌పేటలోని ఏఎంసీ కాంప్లెక్స్‌లోని షాప్ నంబర్ 28 నందు రాయల్ ఎలక్ట్రానిక్స్ షాపులో యోగేష్ అనే వ్యకి పనిచేస్తున్నాడు. సోమవారం షాపు యజమాని రాజేంద్రకుమార్ జైన్ రూ.5లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేయమని యోగేష్‌కు ఇచ్చి పంపాడు. యోగేష్ నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన యజమాని ఇచ్చిన నగదు డిపాజిట్ చేసేందుకు రాజగోపాలచారి రోడ్‌లోని ఐడీబీఐ బ్యాంక్ వద్దకు వెళ్లగా అక్కడ ఇద్దరు వ్యక్తులు బైక్‌మీద వచ్చి బ్లేడ్‌తో చేతి మీద గాయపరచి నగదు తీసుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో బాగంగా సంఘటనా స్థలం, పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు పరిశీలించగా యోగేష్ పోలీసులను తప్పుదారి పట్టించాడని తేలింది. నగదును ముందుగానే వేరొక చోట దాచి పెట్టాడు. తన ఎడమ చేతిని తానే గాయం చేసుకుని కట్టు కథ అల్లాడు. పోలీసుల విచారణలో అసలు విషయం బయటపడింది. దీంతో యోగేష్‌ను అరెస్ట్ చేసి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. యోగేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సురేష్ తెలిపారు.

కార్మికుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

ఘనంగా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న గౌతమ్‌రెడ్డి, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్మికుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు అండగా నిలిచిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు...

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని ఎమ్మెల్సీలను దొడ్డిదారిన గెలిచినంత మాత్రాన రాబోయే ఎన్నికల్లో అధికారంలో వస్తామని చంద్రబాబు పగటి కలలు కంటున్నారని గౌతమ్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాలు గెలిచి క్లీన్ స్వీప్ చేస్తామని చెప్పారు. అధికారంలో ఉండగా కార్మికులను మోసం చేసిన చంద్రబాబుకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. రాబోయే ఎన్నికలలో చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, రాజారెడ్డి ప్రదీప్‌కుమార్, వర్మ, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాస్, అవనిగడ్డ సునీత, ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



అనూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి నగరానికి, కళాశాల పేరు ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారిణి ఎస్.అనూష అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని అనూషను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఈనెల 19 నుంచి 23 వరకు జరిగిన 19వ సీనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో తమ కళాశాల విద్యార్థిని అనూష రెండు కాంస్య పతకాలను సాధించిందన్నారు. అనూషను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. గోవాలో త్వరలో జరగబోయే 37వ జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని అనూష తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్ నిర్వాహకులకు ప్రోత్సాహం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టెర్రస్ గార్డెన్లను ప్రోత్సహించి నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను కోరారు. ఈ గార్డెన్‌ల ద్వారా సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను ప్రజలకు అందుబాటులో తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రీన్ షెడ్ (టెర్రస్ గార్డెన్)ను నిర్వాహకులకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలను అందిస్తామని కలెక్టర్ తెలిపారు. నగరానికి చెందిన టెర్రస్ గార్డెన్స్ నిర్వాహకులతో మంగళవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయలు ఆకుకూరలను స్వయంగా పండించి వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సిటిజి) పేరుతో టెర్రస్ గార్డెన్స్ నిర్వాహకులు ఒకే వేదికపైకి వచ్చి గార్డెన్ నిర్వహణలో లోటుపాట్లపై చర్చించుకోవడం అభినందనీయమన్నారు. టెర్రస్ గార్డెన్ సభ్యులు సమావేశాలను నిర్వహించుకునేందుకు నగరంలోని వ్యవసాయ అధికారుల సంఘం భవన సమావేశ మందిరం, పింగళి వెంకయ్య సమావేశం మందిరం ఉచితంగా కేటాయిస్తామని చెప్పారు. టెర్రస్ గార్డెన్ ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఐసీడీఎస్ పీడీని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ సుభాషిణి, టెర్రస్ గార్డెన్ నిర్వాహకులు డి.నాగలక్ష్మి, పి.శ్రీనివాస్, ఇ.లీలా కుమారి, ఎ.సురేష్, దాసరి శ్రీదేవి ఉన్నారు.

స్వాతి చినుకులు గ్రంథానికి రేపు లక్ష్మీనారాయణ జైనీ పురస్కారం



బలరాం వేమూరి

విజయవాడ కల్చరల్: స్వాతి వార, మాస పత్రిక సంపాదకులు వేమూరి బలరాం రచన స్వాతి చినుకులు గ్రంథానికి 2023 సంవత్సరానికి లక్ష్మీనారాయణ జైనీ జాతీయ స్మారక పురస్కారానికి ఎంపిక చేసినట్లు పురస్కార కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ,జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర జైనీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 6 గంటలకు గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో జరిగే కార్యక్రమంలో పురస్కారంతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. విజయలక్ష్మి జైనీ నిర్మాతగా డాక్టర్ ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో స్వాతి బలరాం అతడే ఒక సైన్యం బయోపిక్ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు. చిత్ర ఆడియో సీడీని సీసీఎల్‌ఏ కమిషనర్ ఎండీ ఇంతియాజ్ ఆవిష్కరిస్తారని చెప్పారు.

త్వరితగతిన ట్రంక్‌లైన్ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో నిర్వహిస్తున్న యూజీడీ ట్రంక్‌లైన్ పనులను ప్రజలకు ఇబ్బందుల్లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. యూజీడీ పనులను మంగళవారం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రంక్ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా వాహన చోదకులకు ప్రత్యామ్నాయంగా రైల్వేట్రాక్ పక్క నుంచి రోడ్డును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్జా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

1 నుంచి పోలీస్ యాక్ట్ అమలు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30 పోలీస్ యాక్ట్ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఆంక్షల సమయంలో ముందస్తు పోలీస్ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంగళవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగర పర్యటనలో భాగంగా అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహ ఏర్పాట్ల పనులను పర్యవేక్షించారు. అనంతరం కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, విగ్రహ విడిభాగాలు జాగ్రత్తగా అమర్చాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని చెప్పారు. అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో కూడా పనులు చేయాలని ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు ఉన్నారు.